## క్లుప్తంగా

### ఎస్సీ రైతులకు ప్రోత్సాహకాలు



వెంకటాద్రిగూడెంలో ఎస్సీ రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న దృశ్యం

చింతలపూడి: ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందని వెంకటాద్రిగూడెం సర్పంచ్ ఆర్‌వీ రామారావు అన్నారు. చింతలపూడి మండలం రాఘవపురం క్లస్టర్ వెంకటాద్రి గూడెం గ్రామ పంచాయతీలో శుక్రవారం ప్రోత్సాహకాల కిట్లను పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తోన్న ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ పోత్సాహకాలను అందిస్తోందని రామారావు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చింతం వెంకట కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు, రాఘవపురం క్లస్టర్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత వెంకట్రావుకు బాండ్ పత్రం అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు యలమంచిలి మండలం రాజా కోడూరుకు చెందిన పారుపల్లి వెంకట్రావు శుక్రవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దాతకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

### క్రీడాకారులకు స్పోర్ట్స్‌వేర్ పంపిణీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బాలబాలికలు జాతి సంపద, వారికి మెరుగైన వసతులు, అవకాశాలు కల్పించాలని బాల వికాస్ ఫౌండర్ కట్టా సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ఈదర సుబ్బమ్మదేవి మునిసిపల్ స్కూల్, ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బాలబాలికలు స్పోర్ట్స్‌వేర్, పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వాసవి సుబ్బారావు, సీతారాజ్యలక్ష్మి ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ సుబ్బారావు, సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహర్రాజ్, కడియం ప్రసాద్, రత్నా పెయింట్స్ అధినేత వి.రత్నకుమార్, స్కూల్ హెచ్‌ఎం పి.కుటుంబరావు, జీఎంవీర్ కృష్ణారావు, తుంపాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### శాశ్వత లోక్‌అదాలత్‌పై అవగాహన



మాట్లాడుతున్న మేరీ గ్రేస్ కుమారి

ఏలూరు (టూటౌన్): శాశ్వత లోక్ అదాలత్, లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యకలాపాలపై ప్యానల్ లాయర్లకు, వాలంటీర్లకు, అడ్వకేట్ గుమస్తాలకు శుక్రవారం సాయంత్రం అవగాహన కల్పించారు. జిల్లా న్యాయసేవా సదన్ భవన్‌లో నిర్వహించిన సదస్సులో శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి మాట్లాడుతూ రవాణా, పోస్టల్, టెలికం, విద్య, వైద్యం, నీటి సరఫరాల, రియల్ ఎస్టేట్, ఆసుపత్రుల సేవలు, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ సేవలపై లోపం సంభవిస్తే శాశ్వత లోక్ అదాలత్‌ను సంప్రదించాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి మాట్లాడుతూ సెప్టెంబరు 9న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు.

### విద్యార్థుల నడవడికపై దృష్టి పెట్టాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థుల నడవడిక, మానసిక స్థితిపై దృష్టి సారించాలని అధ్యాపకులు, ఇతర సిబ్బందికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఆమె శుక్రవారం ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్స్‌కు మార్గదర్శకంగా ఉండాలన్నారు. ర్యాగింగ్ కమిటీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ర్యాగింగ్ గురైన విద్యార్థుల పేరును గోప్యంగా ఉంచుతారని, ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.బాలకష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కాలేజీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు క్రమశిక్షణలో ఉండేలాగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ యాంటీ ర్యాగింగ్ కమిటీ మెంబర్స్ కూన కష్టారావు, సీహెచ్ వంశీకృష్ణ, ఎల్ వెంకటేశ్వరరావు, ఏలూరు ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా, రైతు పక్షపాతి సీఎం జగన్

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

కొయ్యలగూడెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళలు, రైతుల పక్షపాతి అని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంట పద్మశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం కొయ్యలగూడెంలో పోలవరం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలను సముచిత స్థానాల్లో నిలబెడుతూ పురుషులతో సమానంగా రాజకీయ జీవితాలను జగన్ ప్రసాదించారని వివరించారు. రైతు అభ్యున్నతికి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో దేశవ్యాప్తంగా జగన్ ఆదర్శనీయుడయ్యారని కొనియాడారు. జగనన్నను మరోసారి సీఎంను చేయాల్సిన బాధ్యత మహిళలపైనే ఉందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన తర్వాత పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి తొమ్మిది కోట్లు విడుదల చేశానని, మరో రెండు కోట్లు విడుదల చేస్తానని వెల్లడించారు.

**అట్టడుగు వర్గాలకు అందలం**

ఎమ్మెల్యే తెల్ల బాలరాజు మాట్లాడుతూ అణగారిన వర్గాల వారికి, అట్టడుగు ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమే అందలం ఎక్కించగలుగుతోందని అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన అంశాలతో సహా ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌గా ఆరేటి శాంతకుమారి, ఉపాధ్యక్షులుగా తాడిగడప రామకృష్ణ మరో 17 మందితో బాలరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా శాంతకుమారి, రామకృష్ణ మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి, రైతాంగ ప్రధాన సమస్యలను పరిష్కరిస్తామని, కొయ్యలగూడెంలోని ఏఎంసీ యార్డ్ రైతాంగానికి పూర్తిగా అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అతిరాస కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల భాస్కరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు, టౌన్ కన్వీనర్ సంకుకొండ, ఎంపీటీసీలు గంటా శ్రీను, చింత శ్రీదేవి, సర్పంచ్ ముప్పిడి విజయ కుమరి, జెడ్పీటీసీలు దాసరి శ్రీలక్ష్మి, మొడియం రామతులసి, సామంతపూడి సూరిబాబు, కలుం హేమకుమారి, వసంతరావు, ఎంపీపీలు సుంకర వెంకటరెడ్డి, గంజిమాల రామారావు, కారం శాంతి, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, పార్టీ మండలాల కన్వీనర్లు గొడ్డటి నాగేశ్వరరావు, బుగ్గ మురళి, అల్లూరి రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

### వీరిశెట్టిగూడెంలో వైద్య శిబిరం



స్కానింగ్ చేస్తున్న దృశ్యం

కామవరపుకోట: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తడికలపూడి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెం గ్రామంలో విజయవాడ ఆంధ్ర హాస్పిటల్, ఏలూరు గుడ్ సమారిటన్ క్యాన్సర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి బీపీ, షుగర్, చర్మ వ్యాధులు, గుండె, ఊపిరితిత్తులు, వివిధ నొప్పులు, శరీరంలోని గడ్డలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఆలపాటి నాగేశ్వరావు, సర్పంచ్ దేవరపల్లి రామ్మోహన్‌రావు, ఎంపీటీసీ బొప్పన చైతన్యకుమార్, సెక్రటరీ శ్రీనివాసరావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

### పార్కింగ్ స్థలం కేటాయించాలి

కుక్కునూరు: ఆటో డ్రైవర్లకు పార్కింగ్ స్థలం కేటాయించాలని ఆటో యూనియన్ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సమావేశం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. జె.గోపి, యర్నం సాయికిరణ్ పాల్గొన్నారు.

### డీఈఎల్‌ఈడీ పరీక్షకు 166 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఈఎల్‌ఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. సెమిస్టర్ పరీక్షలకు 151 మందికి 147 మంది, సప్లిమెంటరీ పరీక్షకు 71 మందికి 19 మంది విద్యార్థులు హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ తెలిపారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయం



జంగారెడ్డిగూడెం 21వ వార్డులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. స్థానిక 9వ సచివాలయ పరిధిలోని 21వ వార్డుల్లో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమం అంటే సరైన నిర్వచనం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన చేతల ద్వారా చేసి చూపించారని ఎలీజా చెప్పారు. కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నారని తెలిపారు. మిగిలిన అర్హులకూ న్యాయం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు సైతం అమలు చేస్తున్నారన్నారు. హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. వ్యవసాయం, విద్య, వైద్యం ఇలా అన్ని రంగాల్లో తనదైన ముద్ర వేస్తూ వాటి అభివృద్ధికి నిరంతరం జగన్ కృషి చేస్తున్నారన్నారని వివరించారు. ప్రతి గడపకూ వెళ్లి పథకాల గురించి, చేస్తోన్న అభివృద్ధిని గురించి ఎలీజా వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీ రత్నం, పార్టీ పట్టణాధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, కౌన్సిలర్ కంచర్ల గీతాకుమారి, జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు, ఐసీడీఎస్ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ, మండల సచివాలయ కన్వీనర్ చనమాల శ్రీనివాస్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, నాయకులు బత్తిన చిన్న, వందనపు వెంకటేశ్వరరావు, పంది రాజా, పెప్సీ శ్రీను, సంజయ్ గౌడ్, పెసరగంటి త్రిమూర్తులు, కౌన్సిలర్లు, మేనేజర్ కేవీ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### న్యాయ విజ్ఞాన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో రాగింగ్ నిరోధక చట్టంపై శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు అధ్యక్షతవహించి మాట్లాడారు. రాగింగ్ వంటి దుశ్చర్యలకు పాల్పడితే శిక్షకు గురవుతారని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి మంచి ప్రవర్తన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు



జలజీవన్ మిషన్ ధ్రువ పత్రాన్ని సర్పంచ్‌కు అందిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: గ్రామంలోని ప్రతి ఇంటికీ శుద్ధి చేసిన సురక్షిత నీరు అందిస్తామని జలజీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. పోలవరం మండలం సరిపల్లికుంట గ్రామంలో ప్రతి ఇంటికీ శుక్రవారం నుంచి నీరు సరఫరా చేసేందుకు సర్పంచ్ కోటం గంగాదేవి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించామని తెలిపారు. ప్రతి నెలా నీరు, పారిశుధ్య సమస్యలపై చర్చించి పరిష్కరిస్తారని, ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంక్ నిర్వహణ, వాటర్ క్లోరినేషన్ చేస్తారని చెప్పారు. కమ్యూనిటీ కంట్రిబ్యూషన్ యూజర్ చార్జీలు వసూలు చేస్తారని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షిస్తారని, సరిపల్లికుంట గ్రామాన్ని హర్‌ఘర్ జల్ గ్రామంగా సర్పంచ్ ప్రకటించారని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.అప్పారావు, మండల ఉపాధ్యక్షుడు మిడియం సింగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటం బాబూరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ఆరోగ్యమిత్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# త్యాగధనుల ఆశయాలను సాధిద్దాం



సుబేదార్‌మేజర్ సత్యంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా, చైర్‌పర్సన్ లక్ష్మి



చింతలపూడిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ రాంబాబు

జంగారెడ్డిగూడెం: స్వాతంత్ర్యం కోసం కృషిచేసిన త్యాగధనుల ఆశయాలను యువత సాధించాలని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. తొలుత మేరా మిట్టి, మేరా దేశ్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశంగా మార్చుకోవాలనేది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన కూడా అదేనని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఊరిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మిలట్రీ నుంచి ఉద్యోగ విరమణ పొందిన సుబేదార్ మేజర్ సత్యంను ఎమ్మెల్యే ఎలీజా, చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ఘనంగా సత్కరించారు. సత్యం కార్గిల్ యుద్ధం, ఢిల్లీలో పార్లమెంట్‌పై దాడి జరిగిన సమయంలోనూ వీరోచితంగా పోరాడారని ఎమ్మెల్యే ఎలీజా కొనియాడారు. సత్యం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్‌చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, కౌన్సిలర్‌లు, నాయకులు బత్తిన చిన్న, మేడవరపు విద్యాసాగర్, వైసీపీ పట్టణాధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, జిల్లా యూత్ అధ్యక్షులు పడమటి గిరిబాబు, కమిషనర్ భవానీ ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**త్యాగ ధనులకు రుణపడి ఉందాం**

చింతలపూడి: మాతృ భూమికోసం సర్వస్వం త్యాగం చేసిన త్యాగధనుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించకోవాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్ రాంబాబు కోరారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నా భూమి, నా దేశం, నేల తల్లికి వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కమిషనర్ నేల తల్లికి నమస్కరించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. స్వాతంత్ర సమర యోధులు ఉపాధ్యాయుల లక్ష్మి నారాయణ, మాదాసు శేషగిరిరావు, గద్దే విష్ణుమూర్తిల సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జి.రాజేష్‌నాయుడు, కొవ్వూరి వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

## అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ముత్యాలమ్మ, నూకాలమ్మవారి ఆలయాల్లో శుక్రవారం సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. ముత్యాలమ్మ ఉత్సవ విగ్రహానికి, అనంతేశ్వరస్వామికి పంచామృత ఏకవార రుద్రాభిషేకాలు చేశారు. నూకాలమ్మవారికి ప్రభాత పూజ, నిత్యసేవలు అనంతరం ఆలయ కళ్యాణ కళావేదికపై విశేష ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అమ్మవారి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ప్రసాద వితరణకు రెడ్డి సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు రూ.10,116 అందజేశారని ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతులు, మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, బంగారు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

## జగన్ హయాంలో జంగారెడ్డిగూడెం అభివృద్ధి



జంగారెడ్డిగూడెంలో అర్బన్ పీహెచ్‌సీ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత జంగారెడ్డిగూడెం పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలను శుక్రవారం ఎలీజా నిర్వహించారు. రూ.94 లక్షలతో నిర్మించిన అర్బన్ పీహెచ్‌సీని ఆయన ప్రారంభించారు. అమృత్ 2.0 పథకంలో మంజూరైన రూ.1.20 కోట్లతో చేపట్టే మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న అక్కమ్మ కోనేరు అభివృద్ధికి, రూ.70 లక్షలతో చేపట్టే సాలిపేట రోడ్డు, రూ. 37.56 లక్షలతో నిర్మించే సూర్య కళాశాల రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ పీహెచ్‌సీ ద్వారా ప్రజలకు కావాల్సిన వైద్య సౌకర్యాలు అందుతాయన్నారు. సీఎం జగన్ ప్రతి గ్రామంలో హెల్త్ సెంటర్ ఏర్పాటు చేశారని, అర్బన్ ఏరియాలో యూపీహెచ్‌సీ ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రతి ఊర్లో ప్రజలకు వైద్యం చేరువ చేశారని వివరించారు. అక్కమ్మ కోనేరు (చెరువు)ను బాగుచేసి, జాగింగ్ ట్రాక్, పార్క్, చిల్డ్రన్ పార్క్, ఓపెన్ జిమ్ వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గత 25 సంవత్సరాలుగా పట్టణంలోని ప్రధాన రోడ్లు గోతులతో శిథిలావస్థలో ఉన్నాయని చెప్పారు. శ్రీనివాసపురం, బుట్టాయగూడెం రోడ్, సూర్యకాలేజ్ రోడ్డు, సుబ్బంపేట రోడ్డు ఇలా ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన రోడ్లను ఒక్కొక్కటిగా నిర్మిస్తున్నామని వివరించారు. పారిజాతగిరి ఆలయానికి వెళ్లే రోడ్డు పాడైతే పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఆ రోడ్డును పునర్ నిర్మించామని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రతిపక్షాలు అభివృద్ధి లేదని పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. తాను ఎప్పుడూ బహిరంగ చర్చకు సిద్ధమేనని తెలిపారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్‌చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, పార్టీ పట్టణ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు, కౌన్సిలర్‌లు, నాయకులు బత్తిన చిన్న, మేడవరపు విద్యాసాగర్, కమిషనర్ భవానీ ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టిసీమ ఎత్తిపోతల నీరు విడుదల



పోలవరం కుడికాలువకు నీరు విడుదల చేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పట్టిసీమ ఎత్తిపోతల పథకం నీరు విడుదల చేశారు. శుక్రవారం ఎత్తిపోతల పథకం నుంచి 15 మోటార్లను ఆన్‌చేసి 5,310 క్యూసెక్కుల నీటిని కుడికాలువలోకి వదులుతున్నట్టు డీఈ పెద్దిరాజు తెలిపారు. కృష్ణా జిల్లా ప్రాంతానికి తాగునీటి, సాగు నీటి అవసరాలు నిమిత్తం గోదావరి నుంచి నీరు విడుదల చేశామన్నారు.

## డిగ్రీ కళాశాల అర్ధశతాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు

ఉంగుటూరు: నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్ధ శతాబ్ది ఉత్సవాలకు వేదిక తయారయ్యింది. శని, ఆదివారాలు రెండురోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలాభాస్కర్, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. సాయంత్రం 4గంటలకు గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాలు ప్రారంభిస్తారు. అనంతరం పైలాన్‌ను, అరవిందుడు, గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కోస్తా జిల్లాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొంటారు. పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఈపూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బొమ్మిడి అప్పారావు, ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు ఆధ్వర్యం వహించనున్నారు.



### గిరిజన మహిళల ధర్నా

కుక్కునూరు: గిరిజన మహిళ ఆత్మహత్యాయత్నానికి కారకులైన ఏపీజీవీబీ కుక్కునూరు మేనేజర్, వెలుగు సీసీ బోసు, ఏపీఎం కొండయ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటచారి మాట్లాడుతూ నెమలిపేట గ్రామానికి చెందిన డ్వాక్రా గిరిజన మహిళలు 2008లో కుక్కునూరు ఏపీజీవీబీ బ్యాంకులో రుణం పొందారన్నారు. ఈ రుణం క్రమంగా చెల్లిస్తున్నప్పటికీ బ్యాంకు మేనేజర్ మహిళలతో డాక్యుమెంట్లపై సంతకం చేయించుకొని వ్యవసాయ రుణాలుగా మార్పు చేశారని తెలిపారు. అలా తప్పుడు పత్రాలు సృష్టించి ఇప్పుడు ఒక్కో మహిళా రూ.2 లక్షల రుణం చెల్లించాలని వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై మండల పర్యటనకు వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించిన మహిళల చేతిలోంచి వెలుగు సీసీ బోసు లాక్కొన్నాడని తెలిపారు. దీంతో వర్సా రంగమ్మ అనే మహిళ పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రస్తుతం భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతుందన్నారు. కార్యక్రమంలో బాధిత మహిళలు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# మోదీ పాలనలో మతపరమైన దాడులు



ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న మహిళలు, బాలికలు

ఏలూరు (టూటౌన్) : బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా మతపరమైన దాడులు పెరిగాయని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. సేవ్ ఇండియా.. సేవ్ మణిపూర్‌లో భాగంగా ఐద్వా, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో శుక్రవారం సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాల నుంచి భారీ ర్యాలీ, స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, సీఎం బీరన్ సింగ్‌లు చేసిన ప్రకటనలు దోషులను సమర్ధించేలా ఉన్నాయని ఆరోపించారు. తక్షణం మణిపూర్ సీఎంను భర్తరఫ్ చేయాలన్నారు. మోదీ పాలనలో దళిత, గిరిజనులు, ముస్లింలు, క్రైస్తవులపై దాడులు పెరిగాయని వివరించారు. బీజేపీ లౌకిక రాజ్యాంగం స్థానంలో మత రాజ్యాంగాన్ని తీసుకురావాలని భావిస్తుందని అన్నారు. మోదీ ముఖ్యమంత్రిగా ఉండగా గుజరాత్‌లో ముస్లింలపై దాడులు మొదలుకొని నేడు మణిపూర్‌లో క్రైస్తవులపై దాడుల వరకు బీజేపీ ప్రభుత్వం అండతో ఆర్‌ఎస్ఎస్ మతోన్మాదుల ప్రమేయం ఉందని చెప్పారు. మణిపూర్‌లో వేలకొలది ప్రజల నివాసాలు, 250కి పైగా చర్చిలు ధ్వంసం చేశారని వివరించారు. ప్రస్తుతం హర్యానాలో కూడా మతోన్మాదులు దాడులకు తెగబడుతున్నారని వాపోయారు. భారత రిఫార్మ్స్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ హుస్సేన్, సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడారు. ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జి.శారద, పి.వెంకటరమణ, జె.హరీషా దుర్గ, షేక్ సైదాని, మంచెల వెంకటలక్ష్మి, టి.రజని, పి.విజయలక్ష్మి, కె.విజయలక్ష్మి, మంచెల్ల ఇస్సాక్, బి.జగన్నాథరావు, వి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.